# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-02-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్రమంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శంఖుస్థాపన చేయనున్నారు.**

2. **విద్యా రంగంలో ఉపాధ్యాయులకు ఆధునిక, నిరంతర శిక్షణ ముఖ్యమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.**

3. **చలనచిత్ర, టీవీ, నాటక రంగాల కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక నంది అవార్డులను త్వరలో ప్రదానం చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు.**

4. **రాష్ట్రంలోని గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

5. **ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో ఈరోజు భారత్-అమెరికా జట్ల మధ్య రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ జరగనుంది.**

==========================

రాజధాని అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖా మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు శంకుస్థాపన చేయనున్నారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశారు. క్వాంటమ్ వ్యాలీ కోసం ప్రభుత్వం 50 ఎకరాలు కేటాయించింది. శంకుస్థాపన అనంతరం నిర్వహించే సభలో ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి, తదితరులు ప్రసంగిస్తారని అధికారులు చెప్పారు.

--------------------------

విద్య రంగంలో ఉపాధ్యాయులకు ఆధునిక, నిరంతర శిక్షణ ముఖ్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు జిల్లా తుమ్మలపాలెంలో డిస్ట్రిక్ట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ట్రైనింగ్ డైట్ ఆఫ్ ఎక్సలెన్స్ నిర్మాణానికి ప్రత్తిపాడు శాసనసభ్యులు బి.రామాంజనేయులతో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. 'సమగ్ర శిక్ష' పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు మూడు ఐ×జు సెంటర్స్ ఫర్ ఎక్సలెన్స్ మంజూరయ్యాయని తెలిపారు. గుంటూరు, నెల్లూరు, విశాఖపట్నం జిల్లాల్లో ఒక్కో సెంటర్ ఏర్పాటుకు 13 నుంచి 15 కోట్ల రూపాయల వరకు ఆమోదం

లభించిందని కేంద్రమంత్రి వివరించారు.

---------------------------

చలనచిత్ర, టీవీ, నాటక రంగాల కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక నంది అవార్డులను త్వరలో ప్రదానం చేయనున్నట్లు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. రాజమహేంద్రవరంలో ఆయన ఈరోజు విలేకర్లతో మాట్లాడారు. నంది అవార్డులు ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపినట్లు మంత్రి వివరించారు. రెండు, మూడు నెలల్లోనే నంది అవార్డుల కార్యక్రమంతో పాటు నంది నాటకోత్సవాలను కూడా నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ తెలియజేస్తూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

క్వాంటమ్ వ్యాలీతో ప్రపంచ దృష్టిని అమరావతి ఆకర్షిస్తుందని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాజధాని అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పలువురు మంత్రులు స్పందించారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మాణం దేశానికి మైలురాయిగా నిలుస్తుందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. క్వాంటం టెక్నాలజీతో యువతకు హైస్కిల్ ఉద్యోగాలు, పరిశోధనలకు కొత్త దారులు తెరవనున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు చెప్పారు.

---------------------------

రాష్ట్రంలోని గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా ఎర్రగొండ పాలెం నియోజకవర్గ పరిధి టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్లలో 3 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన అఫ్ గ్రిడ్ సోలార్ హోమ్ లైటింగ్ సిస్టమ్ ను గత రాత్రి ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల తండాలోని 611 గృహాలకు సోలార్ విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఎర్రగొండపాలెం నుంచి పాలుట్లకు రహదారి నిర్మించడానికి సాధ్యాసాధ్యాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలియజేస్తూ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశంలోని విద్యార్థులతో ప్రత్యక్షంగా సంభాషించే "పరీక్షా పే చర్చా" 9వ సంచిక కార్యక్రమంలోని రెండోవ భాగం సోమవారం ఉదయం 10 గంటలకు ప్రసారం కానుంది. జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా ఒత్తిడి లేని పరీక్షల ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ... పరీక్షలలో సవాళ్లను అధిగమించడం, సమతుల్యతను కాపాడడం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవడం వంటి వివిధ అంశాలను ప్రధానమంత్రి విద్యార్థులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ యూట్యూబ్ ఛానెల్, ఆకాశవాణి, దూరదర్శన్ లతో పాటు విద్యా మంత్రిత్వ శాఖ సామాజిక మాధ్యమాలలోనూ ప్రసారం అవుతుంది.

---------------------------

అంధుల టీ-20 మహిళల ప్రపంచకప్ గెలుపులో కీలక పాత్ర పోషించిన క్రీడాకారులకు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాన్ని మంజూరు చేసింది. రాష్ట్రానికి చెందిన అంధ క్రీడాకారిణి పి.కరుణకుమారికి 15లక్షల రూపాయలు, జట్టు కెప్టెన్ దీపికకు 10 లక్షల రూపాయలు, కోచ్ అజయ్‌కుమార్‌రెడ్డికి 2 లక్షల 50 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని మంజూరు చేసింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల జరిగిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారికీ నగదు ప్రోత్సాహకాల్ని ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కరుణకుమారికి విశాఖపట్నంలో ఇంటి స్థలం కేటాయింపునకు సంబంధించి మరో ఉత్తర్వును విడుదల చేయనున్నారు.

---------------------------

భారత-అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్ రావు స్వాగతించారు.ఇది ద్వైపాక్షిక సంబంధాలకు ఒక పెద్ద ప్రోత్సాహకంగా, భారతీయ కార్మికులు, రైతులు, వ్యాపారులకు కొత్త అవకాశాలను తెరిచే ఒక అడుగుగా అభివర్ణించారు. రాష్ట్రంలోని సముద్ర ఆహార ఎగుమతిదారులకు, ముఖ్యంగా ఆక్వా రంగానికి గణనీయమైన ఉపశమనం లభిస్తుందని పొట్లూరి భాస్కర రావు వెల్లడిస్తూ..

వాయిస్...25 సెకన్లు

---------------------------

ఐసీసీ టీ20 ప్రపంచకప్ ఈరోజు నుంచి ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా భారత్, అమెరికా మధ్య రాత్రి 7 గంటలకు ముంబాయిలోని వాంఖడే వేదికగా మ్యాచ్ జరగనుంది. టోర్నీలో మొత్తం 20 జట్లు పాల్గొంటున్నాయి.

---------------------------

ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో ఔషధ మొక్కలతో ఉద్యాన వనాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రోగులు, వారి సహాయకులకు ఆహ్లాదాన్ని పంచేలా ఈ వనాల్లో పూలు, ఔషధ మొక్కలను ఏర్పాటు చేస్తారని, అలాగే వాకింగ్ ట్రాక్, బెంచీలు, మంచినీటి సదుపాయాన్ని కల్పించేందుకు అనువైన స్థలాలను పరిశీలిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలివిడతలో అన్ని బోధనాసుపత్రులు, అనంతరం స్పెషాలిటీ ఆసుపత్రుల్లో వీటిని ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

---------------------------

స్వర్ణాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి ఉద్యోగి భాగస్వామి కావాలని గ్రామ, వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజేయస్వామి తెలిపారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వర్ణ గ్రామం, వార్డు శాఖా జిల్లా, మండల అధికారులకు రెండు రోజుల అవగాహన కార్యక్రమాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వర్ణ గ్రామం, వార్డు శాఖ సిబ్బంది ప్రతి పౌరునికి సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో వేర్వేరు స్థాయిల్లో పని చేస్తున్న అధికారులందరికీ ఉద్యోగోన్నతులు లభించినట్లు తెలిపారు.

---------------------------

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. ఏలూరు జిల్లా వడ్లమాను గ్రామంలో రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన తారు రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని మంత్రి నిన్న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారుల నిర్మాణం పూర్తయితే వడ్లమాను గ్రామ ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం అవుతాయన్నారు. నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

======================